# సాక్షి అనకాపల్లి

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023






## న్యూస్‌రీల్

### ప్రశాంతంగా గణితం పరీక్ష

అనకాపల్లిటౌన్ : పదో తరగతి గణితం పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. రెగ్యులర్ విద్యార్థులు 22,174 మందికిగాను 22,061 పరీక్షకు హాజరుకాగా, 113 మంది గైర్హాజరయ్యారు. 1,091 మంది ప్రైవేట్ విద్యార్థులకు 1022 మంది హాజరుకాగా, 69 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. 34 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 99.22 శాతం విద్యార్థులు పరీక్షలు రాసినట్టు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు.

### 61 రోజులపాటు చేపల వేట నిషేధం

తుమ్మపాల: ఈ నెల 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు 61 రోజులపాటు సముద్రంలో యాంత్రిక బోట్లతో చేపల వేటను ప్రభుత్వం నిషేధించినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. సముద్రంలో మత్స్య సంపద పరిరక్షణ, వృద్ధి, నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం చేపల వేటపై నిషేధం విధిస్తామని, అయితే ఇంజన్ ఉపయోగించకుండా సంప్రదాయ పద్ధతిలో చేపల వేట కొనసాగించవచ్చన్నారు. నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేల వంతున వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా జీవన భృతి అందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 17వ తేదీన జిల్లాలో అన్ని షిప్ ల్యాండింగ్ కేంద్రాలలో బోట్ల సర్వే, వెరిఫికేషన్, కలాసీల వివరాలు సేకరిస్తామన్నారు.

### ట్రయథ్లాన్ విజేత ఉజ్వల్



పరుగులో పాల్గొన్న ఉజ్వల్

విశాఖ స్పోర్ట్స్: మంగళూర్ ట్రయథ్లాన్‌లో నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ ఉజ్వల్ చౌదరి విజేతగా నిలిచాడు. ఆదివారం కర్నాటకలోని తన్నీర్ భవిలో జరిగిన ఈ పోటీలో దాదాపు 500 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. దీనిలో నావికాదళానికే చెందిన 40 మంది అథ్లెట్లు ఉన్నారు. వారిలో ఉజ్వల్ రెండు గంటల 37 నిమిషాల్లో ఈవెంట్ ముగించి విజేతగా నిలిచాడు.

### జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు పదిమంది



పతకాలు సాధించిన ఆనందంలో కుస్తీ అకాడమి విద్యార్థులు

కొయ్యూరు: ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో ఈ నెల 16 నుంచి 18 వరకు జరగనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు కొయ్యూరు కుస్తీ అకాడమీకి చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు చిత్తూరు డీఎస్ఏ స్టేడియంలో భారతీయ కుస్తీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్, సబ్‌జూనియర్ కుస్తీ పోటీల్లో ఈ అకాడమీ నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పది బంగారు, రెండు వెండి,మూడు బ్రాంజ్ పతకాలను సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రమణబాబు, మహేష్, సీహెచ్.మహేష్, కె.దేవమ్మ, కె.రాణి, ఎం.రూప, నిర్మల, వి.ప్రసాద్,పి.బుజ్జిబాబు, జి.అశోక్, బంగారు పతకాలు సాధించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పి.రమేష్, కె.దావీదు‌లు వెండి పతాకాలు, ఎస్.మోహన్, హరిశ్చంద్ర, కె.నిర్మల బ్రాంజ్ పతకాలను సాధించారు.

### 12,13 తేదీలలో బొకారో ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఖరగ్‌పూర్ డివిజన్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన ప్రజా ఆందోళనల నేపథ్యంలో పలు రైళ్లు ఆలస్యంగా నడవడం, తిరుగు ప్రయాణానికి కావలసిన రేక్‌ల రోజుల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ధన్‌బాద్‌లో ఈ నెల 12,13 తేదీలలో బయల్దేరే ధన్‌బాద్-అలప్పీ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

# కొబ్బరి.. లాభాల సిరి

**గత మూడేళ్లతో పోలిస్తే కొబ్బరి ధర ఈ ఏడాది ఆశాజనకంగానే ఉంది. రైతులకు కొంతమేర లాభాలనే తెచ్చిపెడుతోంది. కరోనా సమయంలో దిగుబడితోపాటు ఎగుమతులు మందగించి నష్టాలు చవిచూసిన కొబ్బరి రైతు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. దాదాపు మూడేళ్లపాటు కొబ్బరి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన తెల్లదోమ, నల్లమచ్చ తెగుళ్ల కొబ్బరి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. కాయలపై మచ్చలు రావడం, చెట్ల ఆకులు రాలిపోవడంతో దిగుబడి కూడా తగ్గింది. తెగుళ్ల సోకిన తోటలకు రసాయన మందులు వాడకం తగ్గించి కేవలం వేపనూనెను ఎక్కువగా ఉపయోగించడం వల్ల తెల్లదోమ తెగులు తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం కూడా కొబ్బరి రైతులకు మంచి ప్రోత్సాహకాలు ఇవ్వడంతో కొబ్బరి సాగుపై రైతులు మక్కువ చూపిస్తున్నారు.**

- 22 వేల ఎకరాల్లో సాగు
- ఏటా 11 మిలియన్ల కొబ్బరి కాయల దిగుబడి
- ఆశించిన ధర లభించడంతో రైతుల్లో ఆనందం
- సాగుకు ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం
- పంట సేకరణ కేంద్రాల నిర్మాణ వ్యయంలో 75 శాతం సబ్సిడీ



కొబ్బరి బొండాల దిగుబడి



కొబ్బరిలో అంతర పంటగా అరటి సాగు

నక్కపల్లి: కొబ్బరి అనేది నిత్య పంట. ఏడాది పొడవునా ఫలసాయం చేతికి వస్తూ కొబ్బరి తోటలపై ఆధారపడ్డ రైతులను ఆదుకుంటుంది. ప్రస్తుతం కొబ్బరి ధర ఆశాజనకంగా ఉంది. రైతులకు లాభాలు తెచ్చిపెడుతోంది. మామిడి, జీడి తోటలు వేసే రైతులు ఇటీవల కాలంలో వాటి స్థానంలో కొబ్బరి పంట వేస్తున్నారు. కొబ్బరి తోటలకు తూర్పుగోదావరి జిల్లాలో కోనసీమ ప్రాంతం ప్రసిద్ధి. అలాగే విశాఖ జిల్లాలో కూడా కొబ్బరి తోటలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు ఉన్నాయి. యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాలను కూడా మరో కోనసీమగా పిలుస్తారు. యలమంచిలి నియోజకవర్గంలో రాంబిల్లి, అచ్యుతాపురం, యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గంలో నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లో కొబ్బరి తోటలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో 22 వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ప్రతి 40 రోజులకు ఎకరాకు 4 వేల నుంచి 6 వేల కాయలు దిగుబడి వస్తోంది. తీరప్రాంతం వెంబడి ఉన్న ప్రాంతాల్లో రైతులు కొబ్బరి పంటను అధికంగా పండిస్తారు. కొబ్బరిలో అంతర పంటగా అరటిని కూడా సాగు చేస్తున్నారు. జిల్లాలో సాగవుతున్న కొబ్బరి తోటల నుంచి ప్రతి ఏటా అధికారిక లెక్కల ప్రకారం 11 మిలియన్ల కొబ్బరి కాయల దిగుబడి వస్తోంది. ఈ ప్రాంతంలో ఉత్పత్తి అయిన కొబ్బరి కాయలు గుజరాత్, ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్, హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం కొబ్బరి కాయలు రైతుల నుంచి కాయ ఒక్కంటికి 9 నుంచి 11 రూపాయలకు కొనుగోలు చేసి బయట మార్కెట్లో రూ.15ల నుంచి రూ.20లకు విక్రయిస్తున్నారు. కొబ్బరి బొండాన్ని రూ.10 నుంచి రూ.12లకు కొని రూ.20ల నుంచి రూ.25లకు విక్రయిస్తున్నారు. రిటైల్ వ్యాపారులకు కొబ్బరి మంచి లాభాలను తెచ్చి పెడుతోంది.



ఎగుమతికి సిద్ధం చేస్తున్న కొబ్బరి కాయలు

**కొబ్బరి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం**

కొబ్బరి రైతులకు వైఎస్ జగన్ సర్కారు మంచి ప్రోత్సాహం ఇస్తోంది. కొత్తగా కొబ్బరి మొక్కలు నాటే రైతులకు రెండేళ్లపాటు నిర్వహణ నిమిత్తం హెక్టారుకు రూ.7500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. అలాగే ఎల్‌వోడీపీ పథకం, ఆర్ అండ్ ఆర్ పథకం కింద హెక్టారుకు రూ.35 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. ముదర తోటలను, తెగుళ్ల బారిన పడిన చెట్లను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటుకునేందుకు, రెండేళ్లపాటు పచ్చిరొట్ట ఎరువులు, అంతర పంటల సాగు, తెల్ల మచ్చ నివారణ, మోతాదు ప్రకారం ఎరువుల వాడకం, చెట్లకు నెంబర్లు వేసుకోవడానికి ఈ నిధులను మంజూరు చేస్తున్నారు.

**ఆర్బీకేల ద్వారా పంట సేకరణ కేంద్రాల ఏర్పాటు**

ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని కేటగిరీల రైతులకు పలు సదుపాయాలు కల్పిస్తోంది. ప్రతి ఆర్బీకే పరిధిలో పంట సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో కొబ్బరి రైతుల కోసం 36 యూనిట్లను మంజూరు చేసింది. వీటిలో 26 కేంద్రాలకు పరిపాలన అనుమతులు మంజూరు లభించింది. ఈ కేంద్రాల నిర్మాణాలకు రూ.15 లక్షలు ఖర్చవుతుంది. 75 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. 100 మంది రైతులకు కలిసి గ్రూపుగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఈ కేంద్రం మంజూరు చేస్తారు. ఈ కేంద్రాల్లో కొబ్బరి రైతులు పండించిన కొబ్బరి కాయలను శుభ్రపరచుకోవడం, నిల్వ ఉంచుకోవడం, ధర బాగున్న సమయంలో విక్రయించడం, ఎగుమతులు చేసుకోవడం వంటి కార్యకలాపాలు చేసుకోవచ్చు.

**గిట్టుబాటు అవుతోంది**



కొబ్బరి ధర ప్రస్తుతం ఫర్వాలేదు. రైతులకు భారీ లాభాలు రాకపోయినప్పటికీ పెట్టుబడికి గిట్టుబాటు ధర లభిస్తోంది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి, ధర ఫర్వాలేదని పిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా బాగానే ఉంది. తోటల నిర్వహణకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ఆర్బీకేల ద్వారా ఉద్యాన వన పంటలు సాగు చేసే రైతులకు సబ్సిడీతో కూడిన పథకాల మంజూరు, రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడం వల్ల రైతులకు మేలు కలుగుతోంది.

–కొణతాల శ్రీను, రైతు, కొరుప్రోలు

**రైతులకు ప్రోత్సాహం**



జిల్లాలో 7,500 హెక్టార్లలో కొబ్బరి సాగు చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది రైతులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంట సేకరణ కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయి. ప్రతి ఆర్బీకే పరిధిలో రైతులు గ్రూపుగా ఏర్పడితే 75 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మించడం జరుగుతోంది. ఆర్ అండ్ ఆర్, ఎల్‌వోడీపీ పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం రైతులకు ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుంది.

–ప్రభాకర్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

# నాన్న ఇంటిపై జగనన్న



పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో ఇంటి తలుపునకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికించిన లబ్ధిదారులు



తారువలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికిస్తున్న ఈర్లె అనురాధ, పక్కన బూడి సతీమణి రమణమ్మ

సాక్షి, అనకాపల్లి/దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ దేవరాపల్లి మండలంలోని తారువలో తండ్రి బూడి ముత్యాలనాయుడు ఇంటి గోడపై 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అతికించడం ఆసక్తి గొలిపింది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆమె సోమవారం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలను అడిగి సమాధానాలు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఇంటికి వెళ్లారు. ఇంటి గోడపై స్టిక్కర్‌ను అతికించారు. తల్లి రమణమ్మకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నాలుగో రోజూ జిల్లా అంతటా ఇంటింటి సర్వే కొనసాగింది. ప్రతి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించాయి.

- ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పాల్గొన్నారు.
- అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ దేవినగర్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాంబిల్లి మండలం లాలంకోడూరులో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# కోవిడ్‌పై పోరుకు సర్వసన్నద్ధం



ఎన్టీఆర్ వైద్యాలయంలో మాక్ డ్రిల్‌లో వైద్యాధికారులు, సిబ్బంది



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న సూపరింటెండెంట్ నీలవేణిదేవి

అనకాపల్లిటౌన్ : ఉదయం సరిగ్గా 11 గంటలు.. ఎన్టీఆర్ ఆస్పత్రి ఓపీ విభాగం కిట కిటలాడుతోంది. ఒకటే ఉరుకులు..పరుగులు...ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలి...భౌతికదూరం పాటించాలంటూ మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్...దీంతో రోగుల్లో కరోనా రోగిని తీసుకొస్తున్నారనే టెన్షన్ మొదలైంది. ఆకస్మాత్తుగా వైద్య సిబ్బంది మాస్క్ ధరించడం, వార్డులో ఉన్న రోగికి వైద్యాధికారి కోవిడ్ పరీక్షలు చేయడం... ఆస్పత్రి ఆవరణలో ఆక్సిజన్ ప్లాంట్ వద్ద నుంచి వెద్య సిబ్బంది సిలిండర్లు వెంట తీసుకురావడంతో వైద్యాలయంలో కలకలం రేగింది. ఇదంతా కోవిడ్‌పై ముందస్తు చర్యల్లో భాగంగా ఆస్పత్రిలో నిర్వహించిన మాక్‌డ్రిల్ అని తెలిసి అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో...**

నర్సీపట్నం : కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కోవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. సిబ్బందితో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణి దేవి సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. కోవిడ్ పేషెంట్ ఆస్పత్రికి వచ్చినపుడు ఏ విధంగా వైద్యం అందించాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. జ్వరం, జలుబు, తలనొప్పితో బాధపడుతున్న వారికి కోవిడ్ పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి వెంటనే ర్యాపిడ్ టెస్టులు చేయాలన్నారు. ర్యాపిడ్ టెస్టు కిట్లతో పాటు, అత్యవసర చికిత్సకు అవసరమైన ఆక్సిజన్ ప్లాంట్ కూడా ఉందని సూపరింటెండెంట్ తెలిపారు.

# సుర్రుమన్న సూరీడు



ఎండ వేడిమి తాళలేక గొడుగులు, స్కార్ఫ్‌లను ఆశ్రయించిన యువతులు


- కోటవురట్లలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- ఒక్క రోజులో రెండు డిగ్రీలు పెరుగుదల
- అనకాపల్లి, చోడవరంలో మండిన ఎండలు

అనకాపల్లి టౌన్: సూరీడు ధాటికి జనం అల్లాడిపోయారు. ఎండ నిప్పులు చెరగడంతో వడగాడ్పులు వీచాయి. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. వాతావరణ నిపుణులు సోమ, మంగళవారాల్లో ఎండలు ఎక్కువగా ఉంటాయని ముందే హెచ్చరించారు. ఒక్కసారిగా రెండు డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు విలవిల్లాడారు. ఉదయం 10 గంటల నుంచే భానుడు చెలరేగిపోయాడు. సాయంత్రం 5 గంటలైనా ఎండ ధాటి తగ్గలేదు. కోటవురట్ల, చోడవరాల్లో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అనకాపల్లిలో 36.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయిందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం అధికారి తెలిపారు. పట్టణవాసులను ఉదయం నుంచే వేడిగాలులు బెంబేలెత్తించాయి. మంగళ, బుధవారాలు కూడా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే సూచనలున్నాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు.


# విషమ పరీక్ష



సంఘటన స్థలంలో బైక్‌తో సహా నుజ్జయిన గణపతి మృతదేహం (ఇన్‌సెట్) గణపతి (ఫైల్)



చికిత్స పొందుతూ మృతి చెందిన కిరణ్



చికిత్స పొందుతున్న చెల్లమ్మ

- బైకును ఢీకొట్టిన లారీ.. ఇద్దరు మృతి
- మరదలిని పరీక్షకు తీసుకువచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం
- ప్రాణాలు కోల్పోయిన బావ, బావమరిది
- అపస్మారక స్థితిలో యువతి

మాకవరపాలెం/పాయకరావుపేట/చింతపల్లి: మరదలి పరీక్ష కోసం చింతపల్లి నుంచి విశాఖ వచ్చి తిరిగి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ, అతని బావమరిది (యువతి సోదరుడు) ప్రాణాలు కోల్పోయారు. బాధితురాలు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతోంది. మాకవరపాలెం మండలంలోని చంద్రయ్యపాలెం జంక్షన్ సమీపంలో సోమవారం ఈ ఘోరం జరిగింది. పోలీసులు, బాధితుల బంధువులు అందించిన వివరాల ప్రకారం.. పాయకరావుపేట మండలం పి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంచె గణపతి (23) పాడేరు ఏజెన్సీలో గృహ నిర్మాణ పనులు చేస్తుంటాడు. గిరిజన యువతిని పెళ్లి చేసుకొని చింతపల్లిలో స్థిరపడ్డాడు. భార్య చెల్లెలు వంతల చెల్లమ్మ (18)కు సోమవారం విశాఖలో నర్సింగ్ పరీక్ష ఉండడంతో గణపతి, చెల్లమ్మ, ఆమె సోదరుడు వంతల కిరణ్ (20) మోటార్ సైకిల్‌పై నగరానికి వచ్చారు. పరీక్ష పూర్తయ్యాక చింతపల్లి తిరిగి వెళుతుండగా చంద్రయ్యపాలెం జంక్షన్ దాటగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న గణపతిపై నుంచి లారీ దూసుకువెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కిరణ్, చెల్లమ్మలు అపస్మారక స్థితికి చేరుకోవడంతో 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిరణ్ మరణించాడు. చెల్లమ్మను ఉన్నత చికిత్స కోసం విశాఖ తరలించారు. సంఘటన స్థలాన్ని నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

**మృతుల స్వగ్రామాల్లో విషాదం**

పాయకరావుపేట మండలంలో పి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంచె గణపతి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గణపతికి తండ్రి లేరు. తల్లి స్వగ్రామంలో నివసిస్తోంది. భవన నిర్మాణ పనులు చేసుకుంటూ ఏజెన్సీలో ఉంటున్న కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న అతని తల్లి తల్లడిల్లిపోయింది. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. గణపతి వివాహం చేసుకున్న యువతి స్వగ్రామం చింతపల్లి మండలం కొమ్మంగి పంచాయతీ శివారు మల్లవరం. రోడ్డు ప్రమాదంలో గణపతితోపాటు మల్లవరానికి చెందిన అతని బావమరిది వంతల కిరణ్ కూడా మృతి చెందడంతో గ్రామం చిన్నబోయింది. అంత చిన్న వయసులో ఎంత పెద్ద కష్టమొచ్చిందని ఊరంతా కన్నీరు పెట్టుకుంది.

# ఆపదలో ఉన్న బాలుడికి మంత్రి అమర్ భరోసా



బాలుడు తనూష్ ఆస్పత్రి రికార్డులను, ఆరోగ్యశ్రీ వివరాలను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: కొత్తూరు గ్రామంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్‌ను హృదయవిదారకమైన ఓ సంఘటన కదిలించింది. కొండకొప్పాక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జగదీష్ కుమారుడు తనూష్ గుండెలో రక్తనాళాల సమస్యతో బాధ పడుతున్నాడు. రక్తప్రసరణ లేక తన కుమారుడు ఎలా అవస్థ పడుతున్నాడో జగదీష్ మంత్రి అమర్‌నాథ్‌కు వివరించారు. ఈ వ్యాధికి విశాఖలో వైద్యం లేకపోవడంతో హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కార్డుపై శస్త్ర చికిత్స చేయించామని, అయినప్పటికీ వ్యాధి నయంకాలేదని మంత్రి వద్ద జగదీష్ తన బాధ వెళ్లబోసుకున్నారు. తనూష్‌ను మళ్లీ హైదరాబాద్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆరోగ్యశ్రీ కార్డుపై వైద్యం చేయడం కుదరదని చెప్పారని, మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని వివరించారు. దీనికి స్పందించిన మంత్రి అమర్‌నాథ్ బాలుని వివరాలు తీసుకొని వైద్య సహాయానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు.

## క్లుప్తంగా

### అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న గోవులు

నక్కపల్లి: విజయనగరం జిల్లా అలమండ నుంచి రాజమండ్రి అక్రమంగా తరలిస్తున్న గోవులను సోమవారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. జై శ్రీరామ్ జై గోమాత సంస్థ వారు గోవుల అక్రమ తరలింపుపై కొద్దిరోజులుగా నిఘా పెట్టారు. ఇటీవల కాలంలో పశువుల సంతల్లో కొనుగోలు చేసిన గోవులను రాజమండ్రి, హైదరాబాద్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ సంస్థ వారు ఇచ్చిన సమాచారం మేరకు నక్కపల్లి ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కంటైనర్‌లో కుక్కి తరలిస్తున్న 17 ఆవులను గుర్తించారు. వెంటనే ఈ కంటైనర్‌ను ఆవులను స్వాధీనం చేసుకుని కొత్తవలస సమీపంలో ఉన్న గోశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు. గోవుల అక్రమ తరలింపుపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# స్పందనకు వినతుల వెల్లువ





స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కల్పనాకుమారి, డీఆర్వో వెంకటరమణ

**తుమ్మపాల :** స్పందన దరఖాస్తులకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని జేసీ కల్పనాకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్వో వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మిపతి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్పందన అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారుడికి స్పష్టతతో కూడిన సమాధానం ఇవ్వాలన్నారు. భూ సమస్యలకు సంబంధించిన వినతులు ఎక్కువగా పునరావృతం కాకుండా చూడాలన్నారు. మొత్తం 250 వినతులు నమోదయ్యాయి. పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ గేటు వద్ద పలు సమస్యలపై నిరసనలు జరిగాయి. రూరల్ ఎస్సై నరసింహరావు, అదనపు ఎస్సై అంజిబాబు ఆందోళనలపై భద్రతా చర్యలు చేపట్టారు.

**ఆశా కార్యకర్తగా కొనసాగించాలి**

చీడికాడ మండలం మంచాల గ్రామంలో 2008 నుంచి ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న తనను కొనసాగించాలని కోరుతూ గ్రామానికి చెందిన పసుపుల ఆదెయ్యమ్మ స్పందనలో విన్నవించుకుంది. అనారోగ్యంతో తన భర్త గత ఆరు మాసాలుగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ, ఇటీవల మరణించారని కన్నీరు పెట్టుకున్నారు. అనారోగ్యంతో శరీరం సహకరించక విధులకు గత ఆరు నెలల నుంచి హాజరు కాలేకపోయానని, తనను విధుల్లో చేర్చుకునేలా చీడికాడ పీహెచ్‌సీ డాక్టర్‌కు ఆదేశించాలని కోరింది.

**ఆస్తిని మొదటి భార్యకు కట్టబెట్టారు**

తనకు వారసత్వంగా వస్తున్న భూమిని తనకు తెలియకుండా మొదటి భార్య పెద్దాడ సుజ్యం పేరున రెవెన్యూ అధికారులు నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేసినట్టు దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్దాడ సత్తిబాబు స్పందనలో జేసీకి ఫిర్యాదు చేశారు. మొదటి భార్య పేరున ఆస్తుల నమోదును రద్దు చేయాలని రెవెన్యూ అధికారులకు అనేక సార్లు నివేదించినా, పట్టించుకోలేదని వాపోయారు. తక్షణమే ఖాతా నెం.587తో తప్పుగా మంజూరు చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేయాలని కోరాడు.

- రేబాక సర్వే నెం.99 కొండ వద్ద ఇళ్ల నిర్మాణంపై

శంకరం గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరింది. దీంతో ఇరువర్గాలు కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగి, స్పందనలో ఫిర్యాదు చేశారు. శంకరం గ్రామానికి చెందిన పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో రేబాక సర్వే నెం.99లో ఎల్‌పీసీల ద్వారా ఇండ్ల నిర్మాణం చేపడుతుంటే, గ్రామానికి చెందిన కొందరు నాయకులు ప్రభుత్వ భూమి అక్రమించి నిర్మాణాలు చేస్తున్నామంటూ తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, ఆమె భర్త రామకృష్ణ, లబ్ధిదారులు కలెక్టరేట్ వద్ద నిరసన చేసి స్పందనలో వినతి అందించారు.

పేదలకు జగనన్న కాలనీల ద్వారా ఇంటి పట్టాలు మంజూరయ్యాయని, సర్పంచ్ భర్త రామకృష్ణ డబ్బుల కోసం అనర్హులకు తప్పుడు ఎల్‌పీసీలు ఇచ్చారని మరో వర్గం ఆరోపిస్తూ, ఫిర్యాదు చేసింది. కోల్డ్‌స్టోరేజ్ నిర్మించాలి గ్రామీణ జిల్లాగా ఏర్పడిన అనకాపల్లిలో రైతులు పంట నిల్వ చేసుకునేందుకు పట్టణంలో కోల్డ్‌స్టోరేజ్ నిర్మించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నేత కొణతాల హరినాథ్‌బాబు వినతి అందించారు.

# సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి



తారువలో పంచాయతీ కార్యదర్శుల డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

**దేవరాపల్లి :** గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు పాత్ర అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ క్యాంప్ కార్యాలయంలో అనకాపల్లి జిల్లా పంచాయతీ కార్యదర్శుల నూతన డైరీని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేసి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చొరవ చూపి సీఎం జగన్‌కు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గ్రామ స్థాయిలో సైతం అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పెంకె శివ, ఉపాధ్యక్షులు ఎస్.రామునాయుడు, ప్రసన్న, మూర్తి, కార్యదర్శి చింతల శ్రీనివాస్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జి.ఎస్.నళిని, ఒ.సౌజన్యదేవి తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన చిన్నారులకు ఎమ్మెల్యే బాబూరావు పరామర్శ



ప్రమాదంలో గాయపడిన చిన్నారిని పలకరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

**ఎస్.రాయవరం :** శిథిలావస్థకు చేరుకున్న ఇంటికి జగనన్న గృహ నిర్మాణ పథకంలో నిధులు కేటాయిస్తామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రామయ్యపట్నం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ఇటీవల శిథిల ఇంట్లో శ్లాబ్ పెచ్చులూడి గాయపడిన చిన్నారులను పరామర్శించారు. వారిని ఓదార్చి మెరుగైన వైద్యానికి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. వారున్న ఇంటిని పరిశీలించి, వెంటనే వారికి జగనన్న గృహ పథకం అమలు చేసి, కొత్తగా శ్లాబ్ వేసుకునేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. అంతవరకు మరో ఇంట్లో నివాసం ఉండాలని సూచించారు. ఈ పరామర్శలో మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథ్‌రావు, మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు, కొత్తరేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు, పార్టీ నాయకుడు వైబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా సామాజిక తనిఖీ

- వెంకటరాజుపురం ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.5,500 జరిమానా
- ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా అడిషనల్ పీడీ రోజారాణి

**దేవరాపల్లి :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ మండల ప్రజా వేదిక కార్యక్రమం సోమవారం పారదర్శకంగా జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజా వేదిక సమావేశంలో డ్వామా జిల్లా అడిషనల్ పీడీ ఎం.రోజారాణి, జిల్లా విజిలెన్స్ అధికారి (డీవీవో) సిహెచ్. నిర్మలాదేవి, మాడుగుల క్లస్టర్ ఏపీడీ బి. శ్రీనివాసరావు, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఏపీవో డి.చంద్రకళ తదితర అధికారులు పాల్గొన్నారు. 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31 వరకు మండలంలోని 27 పంచాయతీల్లో రూ. 9.31 కోట్ల వ్యయంతో 215 పనులు చేపట్టారు. చెరువులు, పంట కాలువలు పూడికతీత పనులు, రోడ్లు, పంట పొలాలు అభివృద్ధి, పండ్ల తోటల పెంపకం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెంపకం తదితర పనులకు సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్(ఎస్ఆర్‌పి) ఎం. నాగరాజు నేతృత్వంలో గ్రామాల్లో సామాజిక తనిఖీ జరిపారు. గ్రామస్థాయిలో గ్రామాల వారీగా గుర్తించిన లోటుపాట్లను సామాజిక తనిఖీ బృందం సభ్యులు మండల ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాల్లో గుర్తించిన చిన్న చిన్న లోపాలకు సంబంధించి సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తగు ఆధారాలను ప్రజావేదిక దృష్టికి తీసుకురావడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. వెంకటరాజుపురం గ్రామంలో ఉపాధి పనులకు హాజరైన కూలీల వేలిముద్రలు మస్టర్ షీట్‌పై వేయించక పోవడాన్ని గుర్తించారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యంగా పరిగణిస్తూ రూ. 5,500 అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో బి.కింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఎం.అలమండ, వెంకటరాజుపురం వేచలం, సర్పంచ్‌లు దాడి జగన్, దాసరి సంతోష్‌కుమార్, నాగిరెడ్డి శతారినాయుడు, ఉగ్రాకుల అప్పారావు, గొర్లె కొండలరావు, మజ్జి రాజు పాల్గొన్నారు.

# వార్డెన్ నిర్వాకంపై విచారణ



విద్యార్థినులను విచారిస్తున్న బీసీ వెల్ఫేర్ ఆఫీసర్



వార్డెన్ పార్వతి వివరణను సేకరిస్తున్న అధికారి

**చోడవరం రూరల్ :** మండలంలోని గోవాడలో ఉన్న వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ పట్ల విద్యార్థినులు, తల్లిదండ్రులు చేసిన ఆరోపణలపై సోమవారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి విచారణ చేపట్టారు. విద్యార్థులకు మంచి భోజనం పెట్టడం లేదని, కఠిన శిక్షలు వేస్తున్నారని, దుర్భాషలాడుతూ కొడుతున్నారని, రాత్రి వేళల్లో బయటి నుంచి యువకులు గోడదూకి వస్తున్నారని చెప్పినా పట్టించుకోవడం లేదంటూ ఆదివారం మధ్యాహ్నం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై అనకాపల్లి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.సురేష్‌కుమార్ హాస్టల్‌కు చేరుకుని విడివిడిగా విద్యార్థులను, సిబ్బందిని విచారించారు. వారి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం వార్డెన్ పి.పార్వతి వివరణను తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు. బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మరోసారి హాస్టల్‌ను సందర్శించనున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం తాను విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడినట్టు తెలిపారు.



## ఇరు వర్గాల కొట్లాట

**యలమంచిలి :** పాత కక్షలతో ఇరువర్గాల మధ్య కొట్లాట ఘటన మండలంలోని రామారాయుడుపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలో రామాలయం నిర్మాణం, భూ తగాదాల పరిష్కారం కోసం చర్చించేందుకు ఆదివారం రాత్రి గ్రామ పెద్దలు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన బెజవాడ వెంకట రమణ, బత్తిన సత్యనారాయణలు వాగ్వాదానికి దిగి ఆవేశంతో కొట్లటకు దిగారు. వారి మద్దతుదారులు కూడా ఘర్షణకు దిగి పరస్పరం కొట్టుకున్నారు. ఇరు వర్గాల వారు గాయపడడంతో వారిని గ్రామస్తులు యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇరువర్గాలకు చెందిన 10 మందిపై ఐపీసీ 324 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చెసినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

## కోడి పందాలపై పోలీసుల దాడి

**రావికమతం :** కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి అయిదుగురు నిర్వాహకులను అరెస్ట్ చేశామని కొత్తకోట ఎస్ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. కొంజుర్తి గ్రామంలో పెద్ద ఎత్తున పందాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో సోమవారం దాడి చేశామన్నారు. పందాలు నిర్వహిస్తున్న రమణాజీ, రమణ, సురేష్, చందర్రావు, అప్పలనాయుడు పట్టుబడ్డారన్నారు. వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. వారి నుంచి రూ.620 నగదు, ఐదు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## పోలీస్ స్పందనకు 32 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 32 అర్జీలు వచ్చినట్లు జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ వెల్లడించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎక్కువగా భూతగాదాలు, చీటింగ్, కుటుంబ కలహాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

## ఆరుగురు సీఐల బదిలీ

**సాక్షి, విశాఖపట్నం:** విశాఖ రేంజ్ పరిధిలో ఆరుగురు సీఐలు బదిలీ అయ్యారు. రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న బాసిన భాస్కరరావు, శ్రీకాకుళం డీఎస్‌బీలో పనిచేస్తున్న మారాదాన శ్రీనవాసరావును విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌కి అటాచ్ చేశారు. విజయనగరం డీఎస్‌బీగా పనిచేస్తున్న సీహెచ్ రుద్రశేఖర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు సర్కిల్ సీఐగా, అక్కడ పనిచేస్తున్న జి.దేముడుబాబుని విశాఖ రేంజ్ వీఆర్‌కి, విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఈ.నరసింహమూర్తిని విజయనగరం డీఎస్‌డీ-2కి, వీఆర్‌లో ఉన్న ఎం.వెంకటగణేష్‌ని శ్రీకాకుళం డీఎస్‌బీకి బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇఫ్తార్ విందులో మంత్రి అమర్‌నాథ్



రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం మదీన మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు మంత్రి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని దుశ్శాలువతో సత్కరించారు.

- అనకాపల్లి టౌన్

# కేజీహెచ్, విమ్స్‌లో 200 పడకలు

కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కేజీహెచ్‌లో మొత్తం 100 పడకలు, విమ్స్‌లో 100 పడకలు సిద్ధం చేశారు. సోమవారం కోవిడ్ సన్నద్ధతలో భాగంగా రెండు ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. కోవిడ్ రోగులకు అవసరమైన వైద్య సేవల ఏర్పాట్లను పరిశీలించారు.

–మహారాణిపేట/ఆరిలోవ(విశాఖ తూర్పు) :

- కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధం
- 100 ఆక్సిజన్ పడకలతో కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డులు
- విమ్స్‌లో ఆక్సిజన్ ట్యాంక్‌లు, ప్రత్యేక బ్లాక్
- ఏర్పాట్లు పరిశీలించిన కేజీహెచ్ సూపరింటెండెంట్, విమ్స్ డైరెక్టర్



క్రిటికల్ కేర్ యూనిట్ సందర్శనలో కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్



విమ్స్‌లో కోవిడ్ పడకలను పరిశీలిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

కేజీహెచ్ క్యాజువాలిటీ మేడ మీద ఐసోలేషన్ వార్డులో 38 పడకలు, ఆ పక్కనే ఐఆర్‌సీఆర్ వార్డులో 12 వెంటిలేటర్లతో కూడిన పడకలు సిద్ధం చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. అలాగే పాత ఎస్-1 వార్డులో 50 ఆక్సిజన్ పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేశామన్నారు. పడకలు, ఆక్సిజన్ ప్లాంట్, క్రిటికల్ కేర్ యూనిట్లను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులు పరిశీలించారు. ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధం చేయాలని, ఇబ్బందులంటే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణ,డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ ఎ.పద్మజ, ఎఆర్‌ఎంవో డాక్టర్ కె.జగదీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 కల్పన మాలి తదితరులు పాల్గొన్నారు.

**కరోనా సేవలు కోసం విమ్స్ సిద్ధం**

కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని రోగులకు వైద్య సేవలు అందించడానికి విమ్స్‌ను అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఆక్సిజన్ ట్యాంక్‌లు, ప్రత్యేక బ్లాక్, పడకలు, తదితర వాటిని సిద్ధం చేశారు. సోమవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో వైద్యులు సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. విమ్స్‌కు అంబులెన్స్‌లో వచ్చే కరోనా రోగికి ఏవిధంగా ప్రవేశం కల్పించాలి, ఎలాంటి చికిత్స అందించాలి, ఆక్సిజన్ అందించడం తదితర చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ ఎక్స్‌బీబీ 1.16 ఇతర దేశాలతో పాటు భారత దేశంలో కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాపై వైద్య శాఖను అప్రమత్తం చేశాయన్నారు. ఇందులో భాగంగా విమ్స్‌లో ఓ బ్లాక్ కరోనా చికిత్స కోసం కేటాయించామన్నారు. ప్రస్తుతం 100 పడకలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి 600 పడకలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రతి పడక వద్ద ఆక్సిజన్ అందుబాటులో ఉంచామన్నారు. విమ్స్‌లో ఉన్న రెండు ఆక్సిజన్ ట్యాంక్‌లు, రెండు ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. అంతేకాకుండా సాధారణ రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

# మన్యంలో 'ఇటుకల పండగ'



దారిలో వాహనదారుల వద్ద తాసేరు వసూలు చేస్తున్న మహిళలు



శంకుదేవుడి వద్ద పూజలు చేసిన విత్తనాలు అందిస్తున్న పూజారి

- ఏటా చైత్రమాసంలోనే నిర్వహణ
- నెల రోజుల పాటు గిరిజన గ్రామాల్లో సందడి
- విత్తు పండగతో ఆరంభం

**పెదబయలు:** మన్యంలో పండగలు గిరిజనుల ఐక్యతను చాటుతాయి. చైత్రమాసంలో అన్ని గ్రామాల్లో ఎంతో సందడిగా ఇటుకల పండగ నిర్వహిస్తుంటారు. ఈ పండగ ప్రారంభం మొదటి వారంలో వ్యవసాయానికి సంబంధించి విత్తనాలు గ్రామ పోతురాజు, శంకుదేవుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామ పూజారి శంకుదేవుడి గుడి చుట్టూ విత్తనాలు చల్లిన తర్వాత, మిగిలినవి గ్రామంలో అన్ని ఇళ్లకు అందిస్తారు. ఆ తర్వాత పూజలు చేసిన విత్తనాలతో కలిపి వ్యవసాయానికి ఉపయోగిస్తారు. శంకుదేవుడికి పూజలు చేసిన ఐదు రోజుల తర్వాత నుంచి ఇటుకల పండగ ప్రారంభమవుతుంది. మొదటి ఇంట్లో వ్యవసాయ పనిముట్లు, ఇతర సామగ్రికి పూజలు చేస్తారు. తాము పండించిన దానితో వండి ఇంట్లో దేవతలకు నైవేద్యంగా పెట్టిన తర్వాత మగవారు వేటకు బయలు దేరుతారు. ఈ పండగలో మహిళల సందడి ఎక్కువగా ఉంటోంది. గ్రామాల్లో ప్రతీ మగ వారు వేటకు వెళ్లి తీరాల్సిందే. వేటకు వెళ్లి జంతువులను వేటాడి తీసుకుని రాకపోతే పాటలు, మాటలతో హేళన చేస్తారు. రంగునీళ్లు పోసి గ్రామంలో ఉండకుండా అడవికి తరిమేస్తారు. గ్రామాల్లో మహిళలు గుంపుగా ఏర్పడి దారిలో వచ్చి పోయే వారికి తాసేరు(పజోర్) వసులు చేస్తారు. తాసేరు ఇవ్వని వారికి రంగు నీరు పోస్తారు. ఇలా వారం రోజుల పాటు జరుగుతుంది. ఎంతో ఉత్సాహంగా జరిగే ఈ పండగను గిరిజనులు ఎంతో ఉల్లాసంగా జరుపుకుంటారు. గ్రామాల్లో థింసా నృత్యాలు ఎక్కువగా కనిపిస్తోంది.

**శంకుదేవుడే గ్రామ ఇలవేల్పు**

మన్యంలో ప్రతీ గ్రామంలో శంకుదేవుడిని కొలుస్తారు. పూజలు చేసి, దేవుడ్ని శాంతింపజేసిన తర్వాతనే పండగ మొదలెడతారు. అయితే పండగ జరిగేంత వరకు పూజారి రోజూ పూజలు చేస్తారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.

**రెండు గంటల ముందు ప్రయాణం ఉత్తమం**

ఇటుకల పండుగ సందర్భంగా తాసేరు( పజోర్) వసూళ్లు దారి పొడవునా ప్రతీ గ్రామంలో నాలుగు నుంచి ఎక్కువగా దర్శనమిస్తోంది. ప్రతీ పజోర్ గేటులో చిల్లర పైసలు వేయాల్సి ఉంటోంది. పజోర్ గేట్లు వల్ల అత్యవసర పనులు ఉంటే మాత్రం ఇబ్బంది పడే అవకాశం ఉంది. అత్యవసర ప్రయాణం ఉంటే మాత్రం రెండు గంటలు ముందుగాను బయలు దేరడం ఉత్తమం. గతేడాది ఇతర ప్రాంతాల నుంచి పరీక్షలు రాసే విద్యార్థులు పజోర్ గేట్లలో చిక్కుకుని సకాలంలో హాజరు కాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. పండుగ జరిగే నెల రోజులు కాస్త ముందు జాగ్రత్త అవసరం.

## క్లుప్తంగా

### ఘనంగా సత్యమాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కశింకోట: కశింకోటలోని శారదానది అవతల ఉన్న సత్యమాంబ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి అమ్మవారికి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సత్యమాంబకు పూజలు జరిపారు. పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు పెంటకోట రాము, రైతులు, బలిజపల్లి అప్పారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### 18 నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

అనకాపల్లిటౌన్: స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 18 నుంచి మునగపాక హైస్కూల్‌లో పాలిసెట్-23కు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు శిష్ట్ల తమ్మిరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి విద్యార్థులకు పాలిసెట్‌పై శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు 89193 60208 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

### 10 మంది విద్యార్థుల గైర్హాజరు

కశింకోట: మండలంలో నిర్వహిస్తున్న పదో తరగతి నాలుగో పరీక్షకు పది మంది విద్యార్థులు సోమవారం గైర్హాజరయ్యారని ఎంఈవో కె.చిట్టిబాబు తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి 1,216 మంది హాజరు కావలసి ఉండగా.. 1,206 మంది హాజరయ్యారన్నారు. పకడ్బందీగా, ప్రశాంతంగా పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు.

### టీడీపీ నాయకుల నిరసన

అనకాపల్లిటౌన్: విద్యుత్ చార్జీల పెంపుపై ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ముందు సోమవారం టీడీపీ స్థానిక నాయకులు నిరసన తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. అంతకుముందు విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. పార్టీ నేతలు మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, పోలారపు త్రినాథ్ పాల్గొన్నారు.

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మీటర్ | రాజా |
| రంగమార్తాండ | సత్యనారాయణ స్క్రీన్-1 |
| డంజన్స్ అండ్ డ్రాగన్స్ | సత్యనారాయణ స్క్రీన్-2 |
| రావణాసుర | షిర్డీసాయి |
| దసరా | పర్తిసాయి |
| భూతవైద్యుడు(ది పోప్స్ ఎగ్జార్సిస్ట్) | వెంకటేశ్వర |
| రావణాసుర | శ్రీసత్య |
| దాస్ కా ధమ్కీ | రామచంద్ర |

## బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 5,855 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 4,210 | 4,250 |
| మొదటి రకం | 3,930 | 4,200 |
| రెండో రకం | 3,410 | 3,980 |
| మూడో రకం | 3,170 | 3,400 |

## రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-15 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్--22 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 417 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 365 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

# పెరిగిన వేతనం.. 'ఉపాధి'కి ఊతం



మామిడిపాలెం సమీపంలోని చెరువులో మట్టి తవ్వుతున్న ఉపాధి కూలీలు



శంకరంలో ఉపాధి పనులకు వచ్చిన కూలీలు

- రూ.15 పెంచుతూ కేంద్రం నిర్ణయం
- ఈ నెల నుంచి కూలీలకు రూ.272 చెల్లింపు

అనకాపల్లి రూరల్: వలసల నియంత్రణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. మహిళలు, పురుషులు అన్న భేదం లేకుండా చేస్తున్న పనులకు సమాన వేతనం అమలవుతోంది. గతంలో వేసవి కాలంలో పనిభారం అధికం కావడంతో కూలీల హాజరు పెంపుదలకు ప్రోత్సాహకంగా వేసవి భత్యం అదనంగా చెల్లించేవారు. ఇది కేవలం వేసవి మూడు నెలలకు మాత్రమే వర్తించేది. ప్రస్తుతం పాత విధానాలకు స్వస్తి పలికిన కేంద్ర ప్రభుత్వం తాజాగా రోజువారీ వేతనాన్ని రూ.15 పెంచుతూ నిర్ణయించింది. పాత కూలీ గరిష్ఠంగా రూ.257 ఉండగా.. ప్రస్తుతం అది రూ.272కు పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి పెరిగిన వేతనాలు అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థికాభివృద్ధితోపాటు వేతనదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వాలు యోచిస్తున్నాయి.

**12,479 మందికి లబ్ధి..**

మండలంలోని 12,479 మంది వేతనదారులున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 325 పనులను గుర్తించారు. సుమారుగా 5.76 లక్షల పనిదినాలు కల్పించడంతోపాటు దాదాపు రూ.27.2 కోట్లు కూలీలకు చెల్లించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. జాబ్ కార్డులున్న కూలీలందరికీ ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. కూలీలందరికీ కనీసం 100 రోజుల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ పనుల్లేని సమయాల్లోనే వేలాది మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నప్పుడు కూలీల సంఖ్య పరిమితంగా ఉంటోంది. ఒక కుటుంబం గతంలో వంద రోజులు పని చేస్తే రూ.25 వేల వరకూ లభించగా.. ఇప్పుడు రూ.27 వేలకు పైగా లభించనుంది. ఉపాధి పనులకు హాజరయ్యే వారిలో మహిళలే అధికంగా ఉంటున్నారు.

**ప్రస్తుతం నిర్వహిస్తున్న పనులు..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జల సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. వీటిలో కొండవాగుల్లో చెక్ డ్యాంల నిర్మాణం, చెరువుల అభివృద్ధి, రైతుల భూముల్లో భూసార సంరక్షణ పనులు, సాగునీటి కాలువలు, నీటి కందకాలు, చిన్నతరహా నీటి కుంటలు, సేద్యపు కుంటలు, నీటి పారుదల బావులు, రాతి కట్టల నిర్మాణాలు, కాలువల్లో పూడికతీత ప్రధానమైనవి. మౌలిక సదుపాయాల కల్పనలో అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ, సామాజిక భవనాల నిర్మాణాలు, అనుసంధాన సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, చెత్త సంపద తయారీ కేంద్రాలు, భూగర్భ డ్రైనేజీ, శ్మశానవాటికల అభివృద్ధి వంటి పనులు చేపడతారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పెరటి మొక్కల పెంపకం, ఉద్యాన పంటలు, చేపల పెంపకం చెరువులు, జగనన్న కాలనీల గృహ నిర్మాణం ముఖ్యమైనవి.

**సద్వినియోగం చేసుకోండి**



ఉపాధి హామీ పథకంలో పెంచిన సరాసరి వేతనాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. కుటుంబానికి వంద రోజులు పని కల్పించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. వేతనదారులు ఆర్థికాభివృద్ధి సాధించి, జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలి.

– జి.మణికుమార్, ఏపీడీ, అనకాపల్లి

**జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని**



జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ప్రతి వారం సమావేశంలో సిబ్బందికి సూచనలిస్తున్నాం. పెరిగిన వేతనాలను కూలీలకు వివరించి ప్రభుత్వం నియమించిన కొలతల ప్రకారం పనిచేస్తే రూ.272 వేతనం లభిస్తుంది. కూలీల సంఖ్య పెరిగేలా చూస్తున్నాం.

– కె.ధర్మారావు, ఎంపీడీవో, అనకాపల్లి

# అర్హతే కొలమానంగా పథకాల అమలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కొత్తూరు పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని దేవినగర్, ముస్లిం వీధిలో సోమవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పుస్తకాలను అందిస్తూ పరిష్కారానికి నోచుకోని సమస్యలేమైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు సమస్యలను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు అమర్‌నాథ్ ఆదేశించారు. ముందుగా మదీనా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి అమర్‌నాథ్‌ను ముస్లింలు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ వైస్‌చైర్మన్ భీశెట్టి వరహాసత్యవతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**'గడప గడపకు..' నేడు**

కొత్తూరు పంచాయతీ సచివాలయం-2 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

# భానుడి భగభగలు.. నిర్మానుష్యంగా వీధులు



కశింకోట గవరపేటలో నిర్మానుష్యంగా ఓ వీధి

కశింకోట: కశింకోట ప్రాంతంలో సోమవారం సూర్యుడు ప్రతాపం చూపాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కువగా ఉష్ణోగ్రత, వేడి వాతావరణం ఉండటంతో ప్రజలు అధిక శాతం మంది ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసరమైన పని ఉంటే తప్ప బయటకు వెళ్లలేదు. దీంతో ఇక్కడి వీధులు, రోడ్లు జన సంచారం తగ్గిపోవడంతో నిర్మానుష్యంగా మారాయి. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు వేసవి తాపంతో సతమతమయ్యారు. సాయంత్రం ఉష్ణోగ్రత తగ్గి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం కూడా దాదాపు ఇదే ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని సమాచారం.

# ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



తాళ్లపాలెంలో కరపత్రం అందిస్తున్న నాయకులు



సత్తెమ్మ కాలనీలో కరపత్రాలు అందిస్తున్న సిబ్బంది

కశింకోట: కశింకోట, తాళ్లపాలెం గ్రామాల్లో సోమవారం రాత్రి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కశింకోటలోని సత్తెమ్మ కాలనీ, తాళ్లపాలెంలోని ఎన్టీఆర్ కాలనీ, లక్కు వారి వీధుల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై నివాసులకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై సర్వే నిర్వహించారు. ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. బ్యాడ్జీలు పంపిణీ చేశారు. తాళ్లపాలెం సచివాలయ కన్వీనర్ లగిసెట్టి గణేష్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు గుమ్మడి నారాయణరావు, మట్టా సత్యనారాయణ, గట్టా చిన్నారావు, పి.రమణ, గ్రామ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

**సబ్బవరం మండలంలో..**

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులను .. చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వంచించిన విధానాన్ని వివరించారు. పైడివాడ గ్రామంలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయం తీసుకుని వారి ఆమోదంతో స్టిక్కర్లు అంటించారు.

- పైడివాడ అగ్రహారంలో సచివాలయ కన్వీనర్ పెచ్చేటి రమేష్ నాయుడు , తదితరులు ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంట నడవాలని కోరారు.
- మొగలిపురంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఐడీ బాబు పార్టీ శ్రేణులు,గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

**పరవాడ మండలంలో..**

పరవాడ: తాడి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా వార్డు కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

- కలపాకలో సర్పంచ్ బొండా కనకారావు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజలకు వివరించారు. నాయకులు మరిశ శ్రీనివాసరావు, ఇందల రామారావు, కన్వీనర్లు శ్రీను పాల్గొన్నారు.
- భర్నికంలో సర్పంచ్ పెదిశెట్టి పూజశేఖర్ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగనన్నను మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు.

### తాళ్లపాలెంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి

కశింకోట: మండువేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అన్నారు. తాళ్లపాలెం కూడలిలో ల్యాబ్ శ్రీను సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మజ్జిగ, చల్లని నీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ లగిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోండి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో సోమవారం సివిల్ ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్ విద్యార్థులు.. ఫైనలియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీ ద్వారా ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సివిల్ విభాగ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



సబ్బవరం గ్రంథాలయంలో పుస్తకాలు

సబ్బవరం: వివిధ పోటీ పరీక్షలకు ఉపయుక్తంగా ఉండే పుస్తకాలు సబ్బవరం శాఖా గ్రంథాలయంలో అందుబాటులోకి వచ్చాయి. వాటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి పీవీ రమణ కోరారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పాఠకులకు అవసరమయ్యే పుస్తకాలు కావాలని అధికారులు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులను కోరారు. ఆ మేరకు వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే 41 పుస్తకాలు పంపినట్టు గ్రంథాలయ అధికారి రమణ తెలిపారు.

### హోమియో వైద్యుడు శశిధర్‌కు సత్కారం



శశిధర్‌ను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

అనకాపల్లిటౌన్: హోమియో రంగంలో పేదలకు తక్కువ ధరకే వైద్యమందిస్తున్న వైద్యుడు బి.శశిధర్‌ను పబ్లిక్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సదరు ఆస్పత్రిలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సమన్వయకర్త ఆడారి కుమారస్వామి, సభ్యులు కడలి శ్రీరామ్మూర్తి, కొడుకులు శ్రీకాంత్, బి.దివాకర్ పాల్గొన్నారు.

# గవరపేట శ్మశానవాటిక రోడ్డుకు మోక్షం

- రూ.30 లక్షలతో పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లి: మేజర్ పంచాయతీ తుమ్మపాల గవరపేటలో శ్మశానవాటికకు వెళ్లే మట్టి రోడ్డుకు వైఎస్సార్‌సీపీ నేతల చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.30 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, వడ్డాది భారతి, వడ్డాది అశోక్, పన్నీరు వెంకటలక్ష్మి, పీలా విశ్వేశ్వరరావు, దంతులూరి కల్యాణ్ చక్రవర్తి, ఉప సర్పంచ్ చదరం చిన్నా, పీలా బుజ్జి, వార్డు సభ్యులు వెలగా మోదునాయుడు, కొణతాల చంటమ్మ, కొణతాల అర్జున్ నాయుడు, తర సత్యారావు, యనమశెట్టి రామారావు, రవ్వ శ్రీను, పడాల గణపతి, ఆర్‌సీసీ సత్యనారాయణ, కన్వీనర్లు లహరి, ఆడారి ప్రసాద్, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీ నేతల చొరవతో సమస్యకు పరిష్కారం**

ఎన్నో ఏళ్లుగా ఈ మార్గం మట్టి రోడ్డుగానే ఉండిపోయింది. గవరపేటలో ఎవరైనా మృతి చెందినపుడు దహన సంస్కారాలకు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఉపాధి హామీ పనులు, కార్తీక మాసంలో సమీపంలో ఏటి స్నానాలకు అధిక సంఖ్యలో గ్రామస్తులు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజల అవసరాలు, ఇబ్బందులను గుర్తించిన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు తదితరులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో తీర్మానించి రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని దంతులూరి గోపాలరాజు(పెదబాబు) దానం చేశారు. గ్రామస్తుల ప్రధాన సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులకు పలువురు ధన్యవాదాలు తెలియజేశారు.

### ఎన్టీఆర్ స్టేడియం సందర్శన



ఎన్టీఆర్ స్టేడియంలో ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ప్రజాసంఘాల నేతలు పేర్కొన్నారు. మైదానాన్ని సోమవారం వారు సందర్శించి మాట్లాడారు. స్టేడియానికి ఆదాయం వస్తున్నా.. అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆరోపించారు. నేతలు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు ప్రారంభం



పాటిపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి



వెన్నలపాలెంలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో దుర్గాలమ్మ గుడి వద్ద రూ.9.7లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ పనులను సర్పంచ్ వెన్నల అప్పారావు సోమవారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులను చెరువులో పూడికలు తొలగించడానికి ఉపయోగించనున్నట్టు చెప్పారు. పూడిక తొలగింపు పనుల్లో సుమారు 70 మంది కూలీలకు ఉపాధి లభిస్తుందని సర్పంచ్ అప్పారావు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, మాసవరపు పార్వతీముత్యాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

**పాటిపల్లిలో..**

మునగపాక: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి పిలుపునిచ్చారు. మండలంలో ని పాటిపల్లిలో సోమవారం 2023-24 సంవత్స రానికి సంబంధించి ఉపాధి హామీ పథకం పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలస కూలీలను నివారించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అలాగే పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. అర్హులైన నిరుపేదలకు జాబ్‌కార్డులు అందజేస్తామన్నారు. గ్రామాల్లో రహదారులు, కాలువలు, చెరువుల అభివృద్ధికి ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సచివాలయ కన్వీనర్లు సరిసా శ్రీనివాసరావు, భీశెట్టి ధనశ్రీను, వైఎస్సార్‌సీపీ నేత ఆడారి త్రిమూర్తులు, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'మా నమ్మకం నువ్వే జగన్'పై సమీక్ష

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి సచివాలయం పరిధిలోని మోసయ్యపేట, రామన్నపాలెం పంచాయితీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,సచివాలయ కన్వీనర్లు,వాలంటీర్లతో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని చర్చించారు. మండల వైఎస్సార్ సీపీ నాయకులు కోన లచ్చన్నాయుడు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, రాజాన విజయ్, పంచదార్ల పైడిరాజు, గండి బోయిన భాను వెంకట్, ఎంపీటీసీ లాలం శ్రీను, ధర్మారెడ్డి నాయుడు, కొమ్మోజు ఈశ్వరరావు, వడిశెల నాగేశ్వరరావు, అనసూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



తోటాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్న అనిల్‌కుమార్

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. తోటాడ ఉపకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవ లు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయన్నా రు. వైద్యాధి కారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసు కోవాలన్నారు.